క్లుప్తంగా

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసిన సానపురెడ్డి

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో నమ్మకంతో తనపై గౌరవం ఉంచి ఈ పదవి ఇచ్చారని ప్రతాప్‌రెడ్డి అన్నారు.

■ రాయలసీమ పోలీస్ ఫిర్యాదు అథారిటీ మెంబర్‌గా నియమితులైన కార్యకర్త నాగేషా రెడ్డి సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో రూ.26 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వార్డు కౌన్సిలర్ భూమి రెడ్డి వంశీధర్‌రెడ్డి, ఎంఈ సాయికృష్ణ, ఏఈ ఉమామహేశ్వరి, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నవరత్నాలు

అట్లూరు : ప్రతి ఇంటికి నవరత్నాలు అందాయని అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఏ.రామకృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొండూరు సచివాలయ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామాలలో సోమవారం మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి తలుపులకు జగనన్న ఫొటోతో కూడిన స్టిక్కరును అతికించారు. ఆయా కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కొండ్రెడ్డి లక్ష్మిరెడ్డి, నాగం లక్ష్మినరసారెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలువపల్లెలో గడప గడపకు కార్యక్రమం

గోపవరం : మండలంలోని కాలువపల్లె సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్నిశాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అన్నదాన సత్రాల నిర్వాహకులకు సన్మానం

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో జరిగిన ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భక్తులకు అన్నదానం చేసిన అన్నదాన సత్రాల నిర్వాహకులను, స్వచ్ఛందంగా మజ్జిగ, తాగునీరు, పానకం పంపిణీ చేసిన వారికి సోమవారం ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు మూడు రోజుల పాటు అన్నదానం చేయడం గొప్పవిషయం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సర్పంచ్ ఎస్ రామయ్య, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సురేష్‌బాబు, ప్రభాకర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


అంధులకు సేవ దైవకార్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : అంధులకు సేవ చేయడం దైవకార్యమని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక రాయలసీమ ఫర్నీచర్స్ వద్ద గాజులపల్లె పెద్ద సుబ్బమ్మ, పెద్దసుబ్బయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో అంధులకు పింఛన్ పంపిణీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో అంధులకు ఒక్కొక్కరికి రూ.200 చొప్పున అందించారు. శ్రీరాములు, మునిస్వామి, వరదరాజులు, పెంచలయ్యలు రూ.100 చొప్పున అందచేశారు. మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, సంస్థ అధ్యక్షుడు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

బద్వేలు అర్బన్ : వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె సచివాలయం పరిధిలోని ఆరోగ్యపురంలో అనారోగ్యంతో మృతిచెందిన సురేంద్ర కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద దహన సంస్కారాల కోసం సోమవారం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రఘురామిరెడ్డి, శివారెడ్డి, సుబ్బారెడ్డి, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ శ్రీనివాసులు, శానిటేషన్ సెక్రటరీ సుబ్బారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

రూరల్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


శివప్రసాద్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ ఎస్‌ఐ–2గా శివప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన శివప్రసాద్ కలమల్లలో పనిచేస్తూ ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా స్టేషన్‌కు రావాలని ఎస్‌ఐ కోరారు.

కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధం

- పట్టణ ప్రజల సౌకర్యం కోసం అమలు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి


కొత్త మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని 36 ఏళ్ల తర్వాత కొత్త మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయించినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన కొత్త మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీ 1915లో ఏర్పాటు కాగా 1987లో తొలి మాస్టర్ ప్లాన్‌ను తయారు చేశారన్నారు. 2007 వరకు ప్లాన్ కాలపరిమితి ఉండగా 16 ఏళ్లు ముగిసినా కొత్త మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేయలేదన్నారు. ప్రస్తుతం గ్లోబల్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ద్వారా మాస్టర్ ప్లాన్ తయారు చేశామని, 2041 వరకు దీని కాలపరిమితి ఉంటుందన్నారు. గతం, వర్తమానం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి మనిషికి కనీస అవసరాల కోసం ప్రణాళికలను రూపకల్పన చేశారన్నారు.

పాతికేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా పట్టించుకోలేదు

అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పాతికేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడు మాస్టర్ ప్లాన్ గురించి ఏమాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. తన పదవీకాలంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌లకు ఈ విధమైన దిశ నిర్దేశం చేయకపోవడంతో ప్రజలు నష్టపోయారన్నారు. నిబంధనల ప్రకారం 2007లో మాస్టర్ ప్లాన్‌లో అమలు చేసి ఉంటే ఇప్పుడు రోడ్ల విస్తీర్ణం మరింత పెరిగేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రోడ్ల విస్తీర్ణానికి సంబంధించి ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) ప్రకారం వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఇళ్లు, భవనాల నిర్మాణానికి కొత్తగా ఇచ్చే అనుమతులు ఈ మాస్టర్ ప్లాన్ ప్రకారమే ఉంటాయన్నారు.

మాస్టర్ ప్లాన్‌లో ప్రధాన రహదారుల విస్తీర్ణం

మున్సిపాలిటీ విస్తీర్ణం 7.12 చదరపు కిలోమీటర్లు కాగా జనాభా 2 లక్షల వరకు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్లానింగ్ ఏరియా 47.37 చదరపు కిలో మీటర్లు, పాతమాస్టర్ ప్లాన్ ప్రకారం 30.47 చదరపు కిలోమీటర్లు ఉండేదన్నారు. పరిస్థితులకు అనుగుణంగా కొర్రపాడు రోడ్డులో మిక్స్‌డ్ ల్యాండ్ విధానాన్ని అమలు చేశారని, ఇక్కడ కమర్షియల్, నాన్ కమర్షియల్ నిర్మాణాలకు అనుమతులు ఇస్తారని తెలిపారు. ఈ ప్రకారం ప్రస్తుతం గాంధీ రోడ్డు 55 అడుగుల విస్తీర్ణం ఉండగా దీనిని 80 అడుగులకు పెంచడం జరిగిందన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి రామేశ్వరం బైపాస్ రోడ్డు వరకు 80 అడుగుల విస్తీర్ణం ఉంటుందన్నారు. రామేశ్వరం నుంచి మిట్టమడి వీధి, ఆర్ట్స్ కాలేజి రోడ్డు మీదుగా బొల్లవరం వరకు 60 అడుగులకు పెంచారని, ప్రస్తుతం ఇక్కడ 45 అడుగుల రోడ్డు ఉందన్నారు. పుట్టపర్తి సర్కిల్ నుంచి గవిని సర్కిల్ మీదుగా వాసవి సర్కిల్ వరకు ఉన్న రోడ్డును 60 అడుగులకు విస్తరించడం జరిగిందన్నారు.

6న ఎర్రగుంట్ల రోడ్డులో డివైడర్, లైటింగ్ ప్రారంభం

స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులో రూ.3 కోట్లకుపైగా నిధులతో నూతనంగా నిర్మించిన డివైడర్, లైటింగ్‌ను ఈనెల 6న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతి పత్రికకు, ఏబీఎన్ ఛానల్‌కు అభివృద్ధి కానరాదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మండిపడ్డారు. మున్సిపాలిటీలో సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఏసీపీ మునిరత్నం, ప్లానింగ్ సెక్రటరీలు, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

వెల్లాల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం అంకురార్పణం, రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచే భక్తులు స్వాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు వెల్లాలలో కల్యాణం

సంజీవరాయ స్వామి కల్యాణ మండలపంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనున్నట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో ఆయా గ్రామస్తులు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు.

రావణబ్రహ్మపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు

స్థానిక అగస్త్యేశ్వరాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రావణబ్రహ్మ వాహనంపై ఉంచి పురవీధుల్లో శివనామస్మరణలతో ఊరేగించారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన నియోజకవర్గంలోని పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు పద్మశాలీయ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు వద్ది నరసింహులు తెలిపారు. సోమవారం పద్మశాలీయ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న జరుగనున్న 25వ ప్రతిభా పురస్కారాల సిల్వర్ జూబ్లి వేడుకల అవార్డుల ప్రదానోత్సవ ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసెట్, నీట్, మెడిసిన్, ఇంజనీరింగ్, జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన పద్మశాలీయ విద్యార్థిని, విద్యార్థులకు రూ.5,000, ఇంటర్‌లో అన్ని గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.4,000, 900 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతిగా రూ.3,000 అందిస్తామన్నారు. అలాగే 10 తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ప్రథమ బహుమతిగా రూ.4,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, ప్రభుత్వ పాఠశాలలో చదివి 450 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతిగా రూ.3,000 అందిస్తానన్నారు. 10వ తరగతిలో పట్టణంలో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలీయేతర విద్యార్థిని, విద్యార్థులకు రూ.4,000 నగదు బహుమతి ఇస్తామన్నారు. అర్హులైన పద్మశాలీయ విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపల తమ దరఖాస్తులను పద్మశాలీయ కల్యాణ మండపంలో అందచేయాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9440074989, 9290571411లో సంప్రదించాలన్నారు.

ప్రొద్దుటూరులో భారీ వర్షం


సిబ్బందిచే వర్షం నీటిని డ్రైనేజి కాలువలోకి మళ్లిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో సోమవారం వేకువజామునుంచి భారీ వర్షం పడింది. 2.30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి వేకువజామునే వచ్చి మున్సిపల్ సిబ్బందితో డ్రైనేజి కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి వేగంగా వర్షం నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

ఊరటనిచ్చిన వర్షం

అట్లూరు : మండుతున్న ఎండలు ఒక పక్క మరో పక్క ఉక్కపోతతో అల్లాడిపోయిన జనానికి ఆదివారం కురిసిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. గత వారం రోజులుగా ఎండవేడిమితోపాటు ఉక్కపోతతో జనాలు ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం తెల్లవారుజామున విస్తారంగా వర్షం కురువడంతో మండుతున్న ఎండలకు కళ్లెం వేసినట్లైందని ప్రజలు పేర్కొంటున్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు


చెన్నమరాజుపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఏఓ శివశంకర్‌రెడ్డి


వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు : మండలంలోని చెన్నమరాజుపల్లె, కామనూరు గ్రామాల్లో వరి పంట వర్షానికి దెబ్బతింది. కామనూరులో 40 ఎకరాలు, చెన్నమరాజుపల్లెలో 30 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఏఈఓలు చెన్నమరాజుపల్లెకు వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

దువ్వూరు : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న నువ్వు, కొర్ర, వరి, సజ్జ తదితర పంటలను తహసీల్దార్ రమకుమారి, ఏఓ అమర్‌నాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల నష్టాన్ని ప్రాథమిక అంచనాలను ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పొలాలకు వెళ్లి రైతులు సాగు చేసిన పంట నష్ట వివరాలను పూర్తిగా సేకరించి ఉన్నతాధికారులకు పంపాలని తెలిపారు. పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ వీరనారాయణరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చాపాడు : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ సుభాని, మండల వ్యవసాయాధికారి మ్యాగి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరి, వేరుశనగ, నూగు పంటలు దెబ్బతిన్నాయన్నారు. మండలంలోని సిబ్బందితో ప్రతి రైతు పొలం వద్దకెళ్లి దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేయించామన్నారు. వేసవి సీజన్‌లో వరి, నూగు, మినుము 1411 హెక్టార్లలో సాగు కాగా, 219.6 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు గుర్తించామని తెలిపారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపించి రైతులకు తగు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు

మైదుకూరు : రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం. చంద్రబాబు వ్యవసాయం దండగ అంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పండుగగా చేసి చూపారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని విశ్వనాథపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయాలు మాత్రమే ఉండేవని, ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులను ఏర్పాటు చేసి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు చేయిస్తున్నారని సీఎంను ఎమ్మెల్యే కొనియాడారు. మైదుకూరు ప్రాంతంలో పండే కేపీ ఉల్లి, పసుపు పంటలను కొనుగోలు చేసి ఆదుకున్నారని వివరించారు. ఈ సీజన్‌లో రైతుల నుంచి పసుపు పంట కొనుగోలు చేసేందుకు రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. విశ్వనాథపురం పంచాయతీలోని గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలం కేటాయించి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వాటికి ప్రహరీలు కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. పథకాల అమలులో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారని, ఇంటి స్థలాలు, పిల్లల చదువుకు మహిళలు ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు.

గడపగడపకు మన ప్రభుత్వం

సచివాలయ భవనం ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విశ్వనాథపురం పంచాయతీలోని కొత్త సీతారాంపురం, విశ్వనాథపురం ఎస్సీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి లక్ష్మీరమాదేవి, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు బండి నాగేంద్రప్రసాద్, మండల వైస్ ఎంపీపీలు నానుబాల చిన్న కొండమ్మ, ఊటుకూరు రఘురామిరెడ్డి, నానుబాల వెంకటసుబ్బయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, నాయకులు ఏవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ పాల్గొన్నారు.

స్పందనకు అధిక ప్రాధాన్యత

గోపవరం : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో కలిసి స్పందనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు ఉన్నా స్పందనలో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య ఎక్కడా రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నాడు – నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో జూన్ లోపల పూర్తి చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇచ్చిన ప్రణాళిక ప్రకారం టార్గెట్‌లు పూర్తి చేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో జగనన్న ఇళ్లను పూర్తి చేయాలన్నారు. అనంతరం స్పందనలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, నోడల్ అధికారి డాక్టర్ విక్టర్‌మనో క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్

ప్రొద్దుటూరు : ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని వెలవలిలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుతో పాటు గాదెగూడూరు, వెలవలి, పగిడాల, నంగనూరుపల్లె గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వి.అరుణ కుమారి తెలిపారు. ఈనెల 3లోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, 9వ తేదీ జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

■ ఐసీడీఎస్ ప్రొద్దుటూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని ఆసారే వీధి, గోపి రైస్ మిల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులతోపాటు చెత్తకొట్టాలు, దొమ్మరవాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్త పోస్టుకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఆమె వివరించారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి వీరశివకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలను పురస్కరించుకుని శ్రీనివాస నిలయం చారిటీస్ ఆధ్వర్యంలో సంచార చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం కన్వీనర్ శివశ్రీ, వెస్కో ట్రస్ట్ ఫౌండర్ బంగారు తాతారావు, విశ్వంలో విలీనం సంస్థ ఫౌండర్ పెంటా శ్రీనివాసాచార్యులు, విశ్వకర్మ ఫౌండేషన్ ఫౌండర్ గొల్తి మల్లికార్జునరావు సహాయ సహకారాలు, ప్రోత్సాహంతో నిర్వహిస్తున్నారు. ఈ చలివేంద్రాన్ని జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి శనివారం ప్రారంభించారు. మూడు రోజులుగా కొనసాగుతోంది. కార్యక్రమంలో స్వామి శిష్యులు, సేవకులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం



సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు


నరసాపురం: జెండా వందనం చేస్తున్న కార్మికులు


బద్వేలు అర్బన్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ

కలసపాడు : ఎందరో అమరుల త్యాగ ఫలితంగా అమలవుతున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు, గురప్ప, చెన్నయ్య, పీరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

బి.కోడూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకటరమణ, సీపీఐ మండల కార్యదర్శి ప్రసాద్‌రావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, నారాయణ, రామలక్ష్మయ్య, రామోజీ, అనిల్, సంతోష్, వంశీ, చిన్నఓబయ్య, యాగప్ప, ఎస్.ఓబయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన : మండలంలో 137వ కార్మిక దినోత్సవ వేడుకలను కార్మికులు, ఆటోడ్రైవర్లు సోమవారం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మే డే జెండాను ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ 136 సంవత్సరాలుగా కార్మికుల కోసం ఏఐటీయూసీ ఎన్నో పోరాటాలు చేసి కార్మికుల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో చిన్నచెన్నారెడ్డి, జీవన్, రాజు, కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : పట్టణంలో సోమవారం మే డే సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాలు వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు. ఇరు సంఘాలు పట్టణంలో 5 ప్రాంతాల్లో ఎర్రజండా ఎగురవేసి నినాదాలు చేశారు. ఏఐటీయూసీ నాయకులు పిడుగు మస్తాన్ ఆధ్వర్యంలో ఆటో, హమాలీ, పంచాయతీ, భవన నిర్మాణ, అంగన్వాడీ, సివిల్ సప్లయిస్ తదితర సంఘాల నాయకులు, కార్మికులు ఈ మే డే ఉత్సవంలో పాల్గొన్నారు. సీఐటీయూ నాయకుడు భైరవప్రసాద్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎం, లారీ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐద్వా తదితర సంఘాల నాయకులు, కార్మికులు మే డేలో పాల్గొన్నారు.

కార్మిక వర్గ శ్రేయస్సుకు పోరాటాలే శరణ్యం

బద్వేలు అర్బన్ : కార్మికవర్గ శ్రేయస్సుకు పోరాటాలే శరణ్యమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను పురస్కరించుకుని సోమవారం ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, నరసింహ, పి.వి.రమణ, చంద్రమోహన్‌రాజు, బాలు, ఇమ్మానుయేల్, శ్రీను, రాజేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు చోట్ల సీఐటీయూ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన సభలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడారు. కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు నాగేంద్రబాబు, శ్రీనివాసులు, చిన్ని, నాగార్జున, నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ప్రొద్దుటూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. మే డే సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణాలు అర్పించి 8 గంటల పనిని కార్మికులు సాధించుకోగా, నేడు బీజేపీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి బీజేపీపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్‌నాయకులు సాల్మన్ చంటి, గుర్రమ్మ, నీతమ్మ, అన్నపూర్ణ, రవణమ్మ, శాంతి, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

– మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్ డివిజనల్ కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. యూనియన్ నాయకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రూబెన్ పాల్గొన్నారు. పుట్టపర్తి సర్కిల్‌లో ఆటో యూనియన్ అధ్యక్షుడు హరి, బస్టాండ్ వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు గోపాల్, పౌరసరఫరాల గోడౌన్ వద్ద హమాలీ యూనియన్ నాయకుడు సూర్యుడు ఆధ్వర్యంలో, వాసవి సర్కిల్ వద్ద కృష్ణ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.